విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

బ్యాంకు మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-చల్లపల్లి : ఖాతా దారులను ఇబ్బందులకు గురిచేస్తున్న చల్లపల్లి ఇండియన్ బ్యాంకు మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అద్దాడ ప్రసాద్ బాబు డిమాండ్ చేశారు. మేనేజర్ వ్యవహారశైలికి నిరసనగా ఖాతాదారులు గురువారం బ్యాంకు ఎదుట నిరసన చేపటగా రాజకీయ పార్టీల నేతలు మద్దతు పలికారు. అద్దాడ ప్రసాద్ బాబు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు మోర్ల రాంబాబు, జనసేన జిల్లా సహాయ కార్యదర్శి ఉస్మాన్ షరీఫ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మీర్ రిజ్వాన్లు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ బాబు మాట్లాడుతూ, ఖాతాదారుల అకౌంట్లలో జమ అయిన ప్రభుత్వ సంక్షేమ పథకాల సొమ్మును సకాలంలో ఇవ్వకుండా వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారనీ, అకౌంట్లను హోల్డ్‌లో ఉంచి డ్వాక్రా రుణ చెల్లింపులకు ముడిపెట్టి, ఖాతాల్లో అదనపు మొత్తాన్ని జమచేయాలంటూ ఒత్తిడి తీసుకువస్తున్నారని మండిపడ్డారు. ప్రతి రోజూ ఖాతాదారులు వచ్చి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. మేనేజర్‌పై అధికారులు చర్యలు తీసుకోకుంటే బ్యాంకు ఎదుట దీక్షలు చేపడతామని హెచ్చరించారు. బ్యాంకులో డ్వాక్రా రుణం తీసుకున్న తాము ప్రతి నెలా ఒక్కో సభ్యురాలు రూ.4100 చొప్పున చెల్లిస్తూ వస్తున్నామనీ, రుణమాఫీ డబ్బులు ఇవ్వాలంటే రూ.5 వేల చొప్పున ఖాతాలో జమచేయాలని షరతు విధించారని, ప్రతి నెలా అంతమొత్తం తమకు భారంగా ఉంటుందని స్థానిక జమ్మిలంకమ్మ తల్లి గ్రూపు సభ్యులు తెలిపారు. తమ భర్తకు అరోగ్య సమస్యలు ఉండటంతో ప్రైవేటు ఫైనాన్స్ వారి దగ్గర డబ్బులు తీసుకుంటే ఆ డబ్బులు ఖాతాలోంచి తీసుకోకుండా అకౌంట్ ఫ్రీజ్ చేశారనీ, డ్వాక్రా చెల్లింపులు బకాయిలు ఉండటంతో అవి కడితేనే ఇస్తామంటూ షరతుపెట్టారనీ, భర్తకు చికిత్స కోసం డబ్బులు అవసరమంటూ పెదప్రోలుకు చెందిన సుజాత ఆవేదన వ్యక్తం చేశారు. మేనేజరు తెలుగుభాష రాకపోవటంతో ఆయన మాట్లాడే ఇంగ్లీష్, హిందీ భాషలు అర్థంకాక ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నట్లు వాపోతున్నారు.

సీఆర్‌పీఎఫ్ కవాతు

విశాలాంధ్ర బ్యూరో, మచిలీపట్నం : జిల్లాలో నిష్పక్షపాత, పారదర్శక ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా గురువారం మచిలీపట్నం పురవీధుల్లో కేంద్ర సాయుధ బలగాలతో పోలీస్ కవాతు నిర్వహించారు. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును ప్రజలు నిర్భయంగా వినియోగించుకునేలా, అక్రమాలకు తావులేకుండా చూడడానికి రంగంలోకి ప్రత్యేక కేంద్ర సాయుధ బలగాలు ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనకు గురికాకుండా, ఎన్నికల వేళ ప్రలోభాలకు ఆస్కారం లేకుండా పటిష్ట నిఘా, సార్వత్రిక ఎన్నికలు-2024 కృష్ణ జిల్లాలో పారదర్శకంగా, నిష్పక్షపాతంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించడమే లక్ష్యంగా పోలీస్ సిబ్బందికి అదనంగా కేంద్ర సాయిధబలగాలు జిల్లాకు చేరాయి. 27 బెటాలియన్ కు చెందిన కేంద్ర సాయుధబలగాలతో బందరు పట్టణ పోలీసు అధికారులందరూ, సిబ్బందితో కలిసి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశాల మేరకు గురువారం బందరు డిఎస్పి మహమ్మద్ అబ్దుల్ సుభాన్ ఆధ్వర్యంలో మచిలీపట్నం స్థానిక హైని హైస్కూల్ నుండి లక్ష్మీ టాకీస్ సెంటర్, జిల్లా కోర్టు సెంటర్, బస్టాండ్, కోనేరు సెంటర్, కోట తుళ్ళ వారి సెంటర్, బుట్టాయిపేట రామానాయుడు పేట, పరాశపేట చిలకలపూడి మీదుగా జిల్లా పరిషత్ సెంటర్ వరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. అలాగే ప్రజలు ఎవరు కేసులలో చిక్కుకోవద్దని ఒక్కసారి కేసులలో చిక్కుకుంటే జీవితాంతం ఆ కేసు తాలూకు ఇబ్బంది ఎదుర్కోవాల్సిందేనని కనుక ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు ముగిసేలా పోలీస్ వారికి సహకరించాలని ఫ్లాగ్ మార్చ్ ద్వారా అవగాహన కల్పించారు.

23న భగత్ సింగ్ వర్ధంతి జయప్రదం చేయండి

విశాలాంధ్ర-గన్నవరం : ఈ నెల 23న భగత్ సింగ్ వర్ధంతి చేయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ముక్కమాల ఉమామహేశ్వరావు కోరారు. సంయుక్త కిసాన్ మోర్చా పిలుపుమేరకు భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్ వర్ధంతి కార్యక్రమం గురించి గురువారం గన్నవరం సీపీఐ కార్యాలయంలో సీపీఐ, సీపీఎం రైతు సంఘాలునాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ గన్నవరం సీపీఐ కార్యాలయంలో ఈ నెల 23న సాయంత్రం 4 గంటలకు భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా అల్ ఇండియా కిసాన్‌సభ అధ్యక్షుడు, రాష్ట్ర కార్యదర్శి సభ్యులు ఆర్ రఘు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పెద్దు వాసుదేవరావు, పట్టణ కార్యదర్శి కాట్రగడ్డ రామచంద్ర జోషి, కార్యవర్గ సభ్యులు కట్టవరపు విజయరావు, సీపీఎం రైతు నాయకులు సూరగని సాంబశివరావు, సీపీఎం కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు, మిరప నాగేశ్వరరావు, ఉదయ్‌కుమార్, సర్దార్ అవుటపల్లి సాంబయ్య, పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయంపై అవగాహన

విశాలాంధ్ర-కూచిపూడి : గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు ఆధునిక వ్యవసాయంపై అవగాహన కల్పించడం కోసం విశ్వవిద్యాలయం ఆచార్యులు, అధ్యాపకులు, కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ పి శ్రీలత (కోఆర్డినేటర్). టి. ఓ. టీ. డాక్టర్ బి నవీన్ ఆదేశాలతో గ్రామాలలో రైతులకు వ్యవసాయం లోనిమెళుకువల పట్ల అవగాహన కల్పిస్తున్నట్లు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏజీ బీఎస్సీ నాలుగో సంవత్సరం విద్యార్థినులు జి .పవిత్ర శ్రీ, సిహెచ్ శ్రియ, కే.యశ్వంతి, కే. స్రవంతి, బి .యామిని, కెవిఎస్ మాధురి తెలిపారు. ఆ విద్యార్థినులు గురువారం కాజ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమం ద్వారా రైతులలో ఆధునిక వ్యవసాయంపై అవగాహన కల్పించారు. కృష్ణాజిల్లా మొవ్వ మండలం కాజగ్రామంలో సాగవుతున్న పైరులు వాటిల్లో సంభవించే చీడపీడలు, తెగుళ్ల వాటి నివారణ తోపాటు అధిక దిగుబడులు పొందటానికి తీసుకోవాల్సిన సస్యరక్షణ తదితర అంశాలపై సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యాలయ ప్రాంగణంలో గ్రామ పటం, సమస్యల వృక్షం, వృత్త వలయం, పలు రకాల వంగడాలు వాటి దిగుబడులు, ధరలు, చలవ శ్రీలత పటం, ధోరణి విశ్లేషణ తదితర అంశాలపైరంగులతోచిత్రాలు వేసి రైతులకు అవగాహన కల్పించారు. కాజ-1 సచివాలయ ఆర్.బి.కేంద్రం చైర్మన్ పేకేటి సీతారామిరెడ్డి సహకారంతో సేకరిస్తున్న సమాచారంతో మే 30వ తారీకు వరకు రూరల్ అవేర్నస్ వర్క్ ఎక్స్పీరియన్స్ ప్రోగ్రాం (ఆర్. ఏ. డబ్ల్యు.ఈ.పి) కింద నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి అమలుకు చర్యలు

విశాలాంధ్ర-కూచిపూడి : ఎన్నికల కమిషన్ నిబంధనలతో మొవ్వ మండల పరిషత్ అధికారి జి చంద్రశేఖర రావు ఆదేశాలతోగ్రామస్థాయి అధికారులను సిబ్బందిలో గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయి. ఏ నిమిషాన ఏ అధికారి వచ్చి పరిశీలిస్తారోనన్న భయాందోళనలతో క్షుణ్ణంగా శిలాఫలకాలను పరిశీలిస్తూ వాటిని కనబడనీయకుండా కప్పి వేస్తున్నారు. దీనిలో భాగంగానే కూచిపూడిలో రహదారి పక్కన ఉన్న శిలాఫలకాలను మాత్రమేకాకుండా లోపల ఉన్న వాటిపై కూడా దృష్టి సారిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి ఇస్లావత్ భవాని ఆధ్వర్యంలో కార్యదర్శి కే వీరాంజనేయులు, జూనియర్ అసిస్టెంట్ ఏ. రాజపణీంద్ర , వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ పి. ఉమామహేశ్వరరావు, మహిళా పోలీస్ జి భార్గవి ప్రతి బజారు తిరుగుతూ బోర్డుగానీ, శిలాఫలకాలు కానీ, గోడలపై రాతలు గాని ఉన్నాయేమో అని వెతుకుతూ వాటిని తొలగించడంలో నిమగ్నమైనారు. గురువారం కూడా కూచిపూడి లోనే రవి ప్రకాష్.సిలికానాంధ్ర సంజీవని వైద్యాలయంలో 2018లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రారంభోత్సవం చేసిన శిలాఫలకాని సైతం కనపడనీయకుండా మూసేశారు. అలాగే గోడలపై రాసిన బిజెపి ప్రచార ప్రకటన లను,పెడసనగలు రోడ్లో భీముని డ్రైన్ పై పామర్రు నియోజకవర్గ తొలి శాసనసభ్యులు డివై దాసు ఆధ్వర్యంలో నిర్మించిన ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని కూడా చేశారు.అలాగే రైతు బజార్లో ప్రారంభోత్సవ శిలాఫలకాలు, కూచిపూడి సెంటర్లో పక్కా డ్రైనేజీ నిర్మాణం కొరకు 2013 ప్రాంతంలో అప్పటి ఎమ్మెల్యేలు శంకుస్థాపన చేసిన శిలాఫలకాలు, సచివాలయాలలోని ప్రారంభోత్సవ శిలాఫలకాలు కనబడకుండా పేపరు అందించడం కానీ కర్టెన్ వేయడం కానీ చేస్తున్నారు. ఎన్నికల నియమావళి అమలుపై అధికారులు ఎంత భయపడుతున్నారు అంటే కూచిపూడి దేవాలయానికి విరాళం ఇచ్చిన ఒక ప్రజాప్రతినిధి దంపతుల పేరు సైతం కనపడనీయకుండా పేపర్ అంటించడానికి సిద్ధమైనారు. దీనిని బట్టి ఎన్నికల కమిషన్ ఎంత స్ట్రిక్ట్ గా నిబంధనలు పాటిస్తుందో అంచనాలు వేసుకోవచ్చు అని పరిశీలకులు పేర్కొంటున్నారు. ఈ విధంగా మండలంలోని 21 గ్రామాలలో పంచాయతీ సిబ్బంది మారుమూల ప్రదేశాలలో సైతంవెతికి ప్రజాప్రతినిధుల పేర్లు అంటిస్తున్నారు.

తుపాన్ నష్టపరిహారాన్ని విడుదల చేయాలి

విశాలాంధ్రబ్యూరో, మచిలీపట్నం : మిచౌంగ్ తుఫాన్ పంట నష్ట పరిహారాన్ని వెంటనే విడుదల చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు డిమాండ్ చేశారు. గురువారం రైతులతో కలసి డిఎం, సివిల్ సప్లైకు వినతిపత్రం ఇచ్చిన అనంతరం ఆయన మాట్లాడుతూ, వ్యవసాయం దినదిన గండం గా మారుతున్న సమయంలో పంట విత్తన రోజు నుండి చేతికి వచ్చేవరకు అనేక ఆటుపోట్లను ఎదుర్కోవాల్సి వస్తుందని, ఎరువులు పురుగుమందులు, డీజిల్ ,పెట్రోల్ ధరలు, ట్రాక్టర్ కిరాయలు, కోత కోత యంత్రాల కిరాయిలు, ఖర్చులు పెరుగుతున్నాయని, ప్రకృతి వైపరీత్యాలు వెంటాడుతున్నాయని, ఈ సంవత్సరం సీజన్ ప్రారంభంలో అధిక వర్షాల వలన నారుమడులు, యద జల్లినవి, నాట్లు వేసినవి కూడా డ్రైనేజ్ సౌకర్యం సరిగా లేక మునిగి పోవడంతో తిరిగి మరల నాట్లు వేయడానికి రెండు రెట్లు ఖర్చు పెరిగిందని, అన్ని కష్టాలకు ఎదురీది వ్యవసాయం చేస్తే పంట చేతికి వచ్చే సమయంలో తుఫాను రావడంతో పనల మీద ఉన్నవి, నిలువు మీద ఉన్నవి కూడా నీటిలో నాని రైతు విపరీతంగా నష్టపోయి, మన జిల్లాలో నలుగురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, ధాన్యం రంగు మారి పాయరావడంతో ధర తెగ్గొసుకుంటున్నారని, ఇన్ని కష్టాల మధ్య పండిన పంటను ఆర్బికేల ద్వారా అమ్మితే, జనవరి 16 తర్వాత రైతు ఖాతాలో ఇప్పటివరకు నగదు జమ కాలేదన్నారు. దీనితో రైతులు కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, చేసిన ట్రాక్టర్ కిరాయిలకు, వ్యవసాయ కార్మికులకు, రెండో పంటగా వేసిన అపరాలకు పురుగుమందులు కొనుగోలుకు అప్పుల కోసం తిప్పలు పడాల్సి వస్తుందని, కావున ధాన్యం సొమ్ములను వెంటనే విడుదల చేయవలసిందిగా కోరుచున్నాము అన్నారు. అలాగే రవాణా, కాటాకూలిచార్జీలుకూడా ఇచ్చి రైతులను, కౌలు రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి. రంగారావు, సహాయ కార్యదర్శి శీలం నారాయణ, పి. శివనాగేశ్వరరావు, కే. బాబురావు, ఇతర రైతులు పాల్గొన్నారు.

వలంటీర్లను కాపాడేందుకే యత్నం

విశాలాంధ్ర-అవనిగడ్డ : ప్రభుత్వ మద్యం అక్రమంగా నిల్వ ఉంచి పట్టుబడిన గ్రామ వాలంటీర్లను కాపాడేందుకు వైసిపి పెద్దలు ప్రయత్నాలు చేస్తున్నారని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం ఆయన టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మోపిదేవి మండల పెదప్రోలు సివారు కప్తానుపాలెంలో బుధవారం రాత్రి అక్రమ మద్యం లభించిన వ్యవహారంలో 500 పైబడి మద్యం బాటిల్స్ దొరికితే కేవలం 66 బాటిల్స్ మాత్రమే చూపించారని, అసలు లెక్కలు చెప్పకపోతే ఆందోళన చేపడతామన్నారు. ఎన్నికల కోడ్ అమలు లోనికి వచ్చినా అధికారులు ఇంకా వైసిపి నాయకులకు కొమ్ము కాస్తున్నారన్నారు. ఎన్నికల నేపథ్యంలో గ్రామ వాలంటీర్ల ద్వారా ఒక్కో వైసిపి నాయకుని ఇంటికి 500 నుండి 600 మద్యం సీసాలను తరలిస్తున్నారని కొల్లూరి ఆగ్రహం వ్యక్తం చేశారు. కప్తానుపాలెంలో గ్రామ వాలంటరీ వేణు దగ్గర అక్రమ మద్యం 500 సీసాలు దొరికితే ఎస్.ఇ.బి సిబ్బంది నాలుగు మూటల్లో రెండు ద్విచక్ర వాహనాలపై తరలించిన విషయం అందరూ చూశారన్నారు. అధికారులు ఇప్పటికైనా ఎం.ఎల్.ఎ మాటలు, వైసిపి నాయకుల మాటలు విని వాస్తవాలు దాయకుండా తక్షణమే లెక్కలు బయట పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.సి సెల్ నాయకులు ఎం ఆదినారాయణ, విజయ్, మండలి రాంమోహన్‌రావు, పులిగడ్డ నాంచారయ్యలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

శ్యామ్‌కుమార్‌కు మండలి పరామర్శ

విశాలాంధ్ర-అవనిగడ్డ : గుగ్గిలం శ్యామ్ కుమార్‌ను మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ పరామర్శించారు. అవనిగడ్డ తెలుగుదేశం పార్టీ సోషల్ మిడియా గుగ్గిలం శ్యామ్ కుమార్ కాలికి ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న శ్యామ్ కుమార్‌ను గురువారం మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, తెలుగుదేశం పార్టీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షులు మండలి వెంకట్రామ్, ఆర్యవైశ్య నాయకులు ఘంటశాల రాజమోహన్‌రావు (కన్నయ్య) కలిసి పరామర్శించారు.

రోడ్డు ప్రమాద బాధితునికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-మచిలీపట్నం : గత నెలలో రోడ్డు ప్రమాదానికి గురైన ఇమ్రాన్ బాషకు మైత్రి ఫౌండేషన్ వారు ఆర్థిక సాయాన్ని గురువారం అందజేశారు. కృష్ణా యూనివర్సిటీ లో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్న ఇమ్రాన్ బాషా స్థానిక పరాసుపేట ఏరియాలో నివసిస్తారు. గత నెలలో డ్యూటీ ముగించుకుని ఇంటికి వస్తుండగా రోడ్డుప్రమాదం జరిగి కుడి కాలు వేళ్ళు విరిగి అప్పటినుంచి బెడ్ మీద ఉంటూ ఇంటికే పరిమితం అయ్యారు. ఆర్థిక ఇబ్బందులు పడుతూ ఇల్లు కూడా గడవక సాయం కోసం మైత్రీ ఫౌండేషన్ ను సంప్రదించగా వెంటనే స్పందించిన ఫౌండేషన్ సభ్యులు ఆ కుటుంబానికి 2 నెలలకు సరిపడా నిత్యావసర సరుకుల తోపాటు వైద్య ఖర్చులు నిమిత్తం 2 వేల రూపాయలు నగదు అందించడం జరిగింది. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు మైత్రీ ఫౌండేషన్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైత్రీ ఫౌండేషన్ అధ్యక్షులు కె. వేణుకుమార్, సభ్యులు రామకృష్ణ మాస్టారు, అయ్యప్ప,తోకల రమేష్,రిలాక్స్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాలేఖాన్ పేట వద్ద మొబైల్ టాయిలెట్

విశాలాంధ్ర-మచిలీపట్నం టౌన్ : విద్యార్థుల సౌకర్యార్థం కాలే ఖాన్ పేట శివగంగ డ్రెయిన్ వంతెన వద్ద మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు విషయం పరిశీలిస్తున్నామని మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బాపిరాజు అన్నారు. గురువారం ఏ. పి. సి. ఆర్. పి. ఎఫ్ కృష్ణా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, అవనిగడ్డ నాగాయలంక తదితర సుదూర ప్రాంతం నుండి కృష్ణ యూనివర్సిటీ కి వచ్చే విద్యార్థిని విద్యార్థులు కాలేఖాన్పేట సెంటర్లో బస్సుదిగి యూనివర్సిటీ బస్సు వచ్చేవరకు వెయిట్ చేస్తున్న తరుణంలో టాయిలెట్స్ ఏర్పాటు లేకపోవడం వల్ల వారు పడు బాధలను కమీషనర్ దృష్టికి తీసుకురాగా స్పందించిన ఆయన కాలేఖాన్ పేటలో మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. పండుగ రోజులు మరియు సెలవు దినాలలో కూడా ఉదయం 11 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ప్రజావాణి విభాగం పని చేస్తుందని, ఈ అవకాశాన్ని నగరపాలక సంస్థ ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

వార్షిక కళ్యాణోత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర-కూచిపూడి : నాట్యాచార్యుల ఇలవేలు పైన శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి 261 వ వార్షిక కళ్యాణోత్సవాలలో భాగంగా గురువారం అమ్మవారి, అయ్యవారి ఉత్సవము ఉత్సవ మూర్తులను అర్చకులు పెరుమూడి పూర్ణ చంద్రశేఖర్ శర్మ, పెనుమూడి సతీష్ కుమార్ తీర్చిదిద్దారు. పద్మభూషణ్ డాక్టర్ వెంపటిచినసత్యం, స్వరాజ్యలక్ష్మి (చెన్నై) మరువడు అనీష్, మనవరాలు లక్ష్మి కామేశ్వరిలు నూతన వస్త్రాలు అందజేశారు. ఆలయ పాలకమండలి అధ్యక్షుడు కావూరి భానుమూర్తి, ఉపాధ్యక్షుడు పసుమర్తి నారాయణమూర్తి, కళా పీఠం ప్రిన్సిపాల్ డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి పలువురు మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్న తిలకించారు.

విద్యార్థులకు క్రీడా పరికరాలు అందజేత

విశాలాంధ్ర-పెడన : మండలం నందిగామ గ్రామంలో విద్యార్థులు వేసవి సెలవుల్లో క్రీడల పట్ల మక్కువ చూపాలని నందిగామ సర్పంచి బొడ్డు చిన్నబాబు(సీతయ్య) అన్నారు. నందిగామలో విద్యార్థులకు వేసవి సెలవుల నిమిత్తం అనగాని అంకాలరావు సౌజన్యంతో క్రీడా సామాగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో యరగని నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి త్రిముఖ వ్యూహం : డీఆర్‌ఎం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రైలు ప్రయాణీకుల ఫిర్యాదులను తక్షణం పరిష్కరించేందుకు త్రిముఖ వ్యూహాన్ని అమలు చేయాలని డిఆర్ఎం నరేంద్ర ఎ.పాటిల్ సూచించారు.గురువారం డివిజనల్ కార్యాలయంలో రైల్ మదద్ (ప్రయాణ సమయంలో కోరుకునే సహాయం కోసం మొబైల్ అప్లికేషన్) ప్లాట్‌ఫారమ్,ఇతర ప్రయాణీకుల ఫిర్యాదులపై అధికారులు,సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదులను పరిష్కరించేందుకు అన్ని రంగాలలో సేవలను యథాతథంగా ఉంచడం ద్వారా ఫిర్యాదుల సంఖ్యను తగ్గించే విధంగా అనునిత్యం అందుబాటులో ఉండాలన్నారు. పిర్యాదు రిజిస్టర్ అయితే పరిష్కారానికి ఉన్న సమయాన్ని తగ్గించటంతో పాటు సంతృప్తికరమైన ఫీడ్‌బ్యాక్ ద్వారా ముగింపు పలకాలన్నారు. ప్రధానంగా వేసవిని దృష్టిలో ఉంచుకుని మంచి నీటి ఏర్పాట్లను,సన్నద్ధత చర్యలను పరిశీలించాలన్నారు. రైలు ప్రయాణీకులు కుడా సురక్షితమైన,సౌకర్యవంతమైన ప్రయాణాన్ని నిర్ధారించడంలో రైల్వేకి సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేస్తుంది. ప్రయాణీకులు కనీస సామాను,అధీకృత టిక్కెట్లతో ప్రయాణించాలని, సరైన కోచ్‌లలో ఎక్కాలని, రద్దీని నివారించడానికి సమయానికి ముందే స్టేషన్‌కు చేరుకోవాలని, మీరు ఎవరినైనా పికప్ చేయడానికి/డ్రాప్ చేయడానికి స్టేషన్‌కు వస్తున్నట్లయితే ప్లాట్‌ఫారమ్ టిక్కెట్‌లను కొనుగోలు చేయాలని మరియు పరిశుభ్రతను కాపాడుకోవడంలో రైల్వేకు సహాయం చేయంగా ఉండాలన్నారు.ఏడిఆర్ఎమ్ పి.ఈ ఎడ్విన్ (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) మాట్లాడుతూ వైద్య సంబంధిత ఫిర్యాదులను ఆన్‌బోర్డ్‌లో డీల్ చేస్తున్నప్పుడు అత్యవసర ప్రతిస్పందన బృందం తక్షణమే అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు.మరో ఏడిఆర్ఎం ఎమ్. శ్రీకాంత్ (ఆపరేషన్స్) మాట్లాడుతూ ఎక్కువ మంది ప్రయాణీకులను ఆకర్షించడానికి ఎటువంటి అసంతృప్తి లేకుండా చూడటం అలాగే సమయపాలన పనితీరును మెరుగుపరచాలని ఆపరేటింగ్ సిబ్బందికి సూచించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2023-24లో మొత్తం 46,766 ప్రయాణీకుల ఫిర్యాదులలో 46,760 ఫిర్యాదులు 99.8% పరిష్కారం చేశామన్నారు. ఈ సమావేశంలో అన్ని బ్రాంచ్ ఆఫీసర్లు సమావేశానికి భౌతికంగా హాజరు కాగా డివిజనల్ కంట్రోలర్లు, సెక్షన్ సూపర్‌వైజర్లు,టిక్కెట్ చెకింగ్ సిబ్బందితో పాటు డివిజన్ వ్యాప్తంగా ఉన్న ఇతర సిబ్బంది వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా సమీక్షా సమావేశానికి హాజరయ్యారు.

దస్తావేజు పోయినది

ఏలూరు జిల్లా, కలిదిండి మండలం, కోరుకొల్లు గ్రామనికి చెందిన **గంగుల సూరిబాబు** తండ్రి **సుబ్బారావు** అను నేను కోరుకొల్లు గ్రామంలో ఉన్న నా తాలూకు ఆస్తికి సంబంధించిన **ఆర్ ఎస్ నెం. 177/బి లో య.0-20 సెంట్లు** నివేశన స్థలమునకు చెందిన **దస్తావేజు నెం.885/ 2013** పార్టీషన్ ఒరిజినల్ దస్తావేజులు తీసుకుని బ్యాగులో పెట్టుకుని మా ఇంటివద్ద నుండి ద్విచక్ర వాహనంపై (వయా)ముల్లంపూడి గ్రామం మీదుగా బంటుమిల్లి మండలం, బంటుమిల్లి గ్రామంలోని బ్యాంకు వద్దకి వెళ్ళి చూడగా బ్యాగ్ కనబడలేదు. బ్యాగుతో సహా ఎక్కడో జారి పడిపోయినవి. ఎంత వెదికినను దొరకలేదు. ఎవరికైనా దస్తావేజులున్న బ్యాగ్ దొరికినయెడల దయచేసి ఈ క్రింది అడ్రసుకు తెలియపరచ గలరని ఆశిస్తున్నాను.

గంగుల సూరిబాబు, తండ్రి సుబ్బారావు,
కోరుకొల్లు గ్రామం,
కలిదిండి మండలం, ఏలూరు జిల్లా.
సెల్ : 84668 56889

'పోషణ పక్వాడా'పై అవగాహన

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలో మొవ్వ ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో కొనసాగుతున్న పోషణ పఖ్వాడ కార్యక్రమంలో భాగంగా గురువారం మొవ్వ మండలంలోని పాలంకిపాడు గ్రామం అంగన్వాడి కేంద్రంలో అవగాహన కల్పించారు. పెరటి తోటలలో సాగు చేసుకునేతోటకూర, గోంగూర, కొత్తిమీర, మెంతికూర ఆకుకూరలలో అధిక శాతం పోషకాలు ఉంటాయని, అలాగే తక్కువ ఖర్చుతో అధిక పోషకాలు ఉన్న పదార్థాలను తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ అబ్దుల్ సలీమున్నిసా గర్భవతులకు బాలింతలకు, కౌమార బాలికలకు వెల్లడిచేశారు. అలాగే ప్రభుత్వం సరఫరా చేసే పోషక పదార్థాల కిట్లు వినియోగించుకోవాలని సూచించారు. ప్రీస్కూల్ పిల్లలకు బాలామృతం అందించి బలవర్ధులుగా తయారు చేయాలని ఆమె హితవు పలికారు. ఈ సందర్భంగా ఓటు నీ భవిష్యత్తు పై అవగాహన కల్పించే ప్రతిజ్ఞ నిర్వహించారు.

ఆకట్టుకున్న అందెలరవళులు

విశాలాంధ్ర-కూచిపూడి : శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వార్షిక కళ్యాణ మహోత్సవం సందర్భంగా ఈనెల 26వ తేదీ వరకు నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల లో భాగంగా రెండవ రోజైన గురువారం నాట్య విద్యార్థులు ప్రదర్శించిన అంశాలు తో నాట్యానికి ఆద్యులైన శ్రీ సిద్ధేంద్ర యోగి మైమరచారు. ఈ సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ బాధ్యులైన నాట్యాచార్యులు డాక్టర్ వేదాంతం రాధేశ్యాం, డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి, డాక్టర్ చింతా రవి బాలకృష్ణలపర్యవేక్షణలో నిర్వహించిన నాట్యాంశాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. బిస్మిల్లా ఖాన్ యువ పురస్కార్ అవార్డు గ్రహీత, శ్రీ సిద్ధేంద్ర యోగి కూచిపూడి నాట్య కళా పీఠం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చింతారవి బాలకృష్ణ విద్యార్థులు వేర్వేరుగా సోలో నృత్యాలను ప్రదర్శించి వ్యక్తిగట్టించారు. డి వర్షితావర్మ (విజయవాడ) గోవర్ధనగిరి దార గోవిందా...., ఎం హెచ్ వి సాయి భవ్య (హైదరాబాద్) దశావతార శబ్దం, పి.రుశాలి (ధవలేశ్వరం) ఝుణుత శబ్దం, ఎల్ సుష్మిత (విజయవాడ) నమో నమో రఘుకుల నాయక అన్నమాచార్య కీర్తన, ఈశ్వరి (ధర్మవరం) శివుడు తాండవ మాడెను అంశాన్ని ప్రదర్శించారు. కూచిపూడి కళాక్షేత్రం (విశాఖపట్నం) నిర్వాహకులు గురు.హరి రామమూర్తి శిష్యురాలు ఇరుగు మంజూష వినాయక కీర్తన, అన్నమాచార్య కీర్తన ప్రదర్శించారు.

చెక్ పోస్ట్ వద్ద తనిఖీలు

విశాలాంధ్ర-వీరులపాడు: ఎన్నికల ప్రక్రియలో భాగంగా మండల తహాశీల్దార్ రాజ కిషోర్ అంతః రాష్ట్ర సరిహద్దుల వద్ద గల చెక్ పోస్ట్ లను గురువారం పరిశీలించారు.వీరులపాడు మండలం పెద్దాపురం గ్రామం వద్ద గల అంతఃరాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించారు.అక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఈవోపీఆర్డి పి.ఏసుబాబు మరియు పోలీసు సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఎన్నికల నియమావళి ని అనుసరించి నిఘా ని కఠినతరం చెయ్యాలని, ప్రతి ఒక్కరినీ తనిఖీ చేసిన పిమ్మటే రాష్ట్ర సరిహద్దులోకి అనుమతించాలి అధికారులను సూచనలు చేశారు.అనంతరం జుజ్జూరు కేంద్రం లోని తహాశీల్దార్ కార్యాలయం నందు మండలం లోని బైండోవర్ కేసులను పరిశీలించారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : శుక్రవారం సా॥ 6:24
సహరి : శనివారం ఉ॥ 4:52

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

కలెక్టర్ పోలింగ్ కేంద్రాలు తనిఖీలు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్) : జిల్లాలో ఎన్నికలను ప్రజాస్వామ్య స్ఫూర్తితో సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని.. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలతో పాటు స్ట్రాంగ్‌రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలు.. ఇలా ప్రతి అంశంలోనూ మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో భాగంగా గురువారం కలెక్టర్ డిల్లీరావు. విజయవాడ ఆర్‌డీవో బీహెచ్ భవానీ శంకర్, కేఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి తదితరులతో కలిసి గురువారం నగరంలో వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. విజయవాడ తూర్పు నియోజకవర్గ రిసెప్షన్ సెంటర్‌కు సంబంధించి ఎస్ఎస్ఎం పబ్లిక్ స్కూల్‌ను, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ రిసెప్షన్ సెంటర్‌కు సంబంధించి గాంధీజీ మహిళా కళాశాలను తనిఖీ చేశారు. పోలింగ్‌కు ముందు, పోలింగ్ రోజున, పోలింగ్ తర్వాత.. ఇలా మూడు దశలకూ అవసరమైన ఏర్పాట్లను ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా చేయడం జరుగుతోందన్నారు. ఎన్నికల ప్రక్రియకు అవసరమయ్యే వివిధ కేంద్రాల వద్ద విద్యుత్ సరఫరా, సూచికల ఏర్పాటు, మౌలిక వసతులు.. ఇలా ప్రతి అంశంపైనా ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నట్లు వెల్లడించారు. భద్రత పరంగా కూడా పటిష్ట ప్రణాళికతో ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ డిల్లీరావు తెలిపారు. కలెక్టర్ వెంట రెవెన్యూతో పాటు వివిధ శాఖల అధికారులు ఉన్నారు. నాణ్యతతో సత్వరం ఫిర్యాదుల పరిష్కారం:

ప్రస్తుతం ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమల్లో ఉన్నందున వివిధ మార్గాల ద్వారా వచ్చే ఫిర్యాదులను నాణ్యతతో పరిష్కరించడం జరుగుతుందని కలెక్టర్ డిల్లీరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంసీసీ, ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులను కంట్రోల్ రూం నెంబర్ (0866-2570051)కు ఫోన్‌చేసి తెలియజేయవచ్చని సూచించారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : స్థానిక తహాశీల్దారు వారి కార్యాలయంలో 84 జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజక వర్గ రిటర్నింగ్ ఆఫీసరు ఎస్.వెంకటేశ్వర్లు అధ్యక్షతన గురువారం నియోజకవర్గ పరిధిలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు తహాశీల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు మరియు జగ్గయ్యపేట మునిసిపల్ కమిషనర్ ,గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఈవీఎం, వీవీప్యాట్స్‌కు

పటిష్ట భద్రత

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్) : ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం), వీవీప్యాట్ గోదాము భద్రతకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. గురువారం గొల్లపూడిలోని ఈవీఎం, వీవీప్యాట్ గోదామును కలెక్టర్ ఎస్.డిల్లీరావు.. అదనపు సీఈవో ఎం.ఎన్.హరెంధిర ప్రసాద్, సమన్వయ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈవీఎం, వీవీప్యాట్‌ల భద్రతకు సంబంధించి చేసిన ఏర్పాట్లను తనిఖీ చేశారు. సీసీ కెమెరాల భద్రతా వ్యవస్థను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా (ఈసీఐ) ఇప్పటికే ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో గోదాము భద్రతకు చేసిన కట్టుదిట్టమైన ఏర్పాట్ల కొనసాగింపునకు ఎన్నికలు, రెవెన్యూ, పోలీస్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడా ఎలాంటి పొరపాటు జరక్కుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి నెల ఈవీఎం, వీవీ ప్యాట్ గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి, సమగ్ర నివేదికను సమర్పిస్తున్నట్లు తెలిపారు. గోదాము భద్రత పరంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూస్తున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా ఈసీఐ, సీఈవో సూచనలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలోనూ ఈవీఎం, వీవీప్యాట్ గోదాము తనిఖీ ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. ఈవీఎం, వీవీప్యాట్ గోదాము సందర్శనలో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో పాటు డీఆర్‌వో వి.శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ గల నటుడు శోభన్ బాబు

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : ఆంధ్రుల అభిమాన అందాల నటునిగా పేరు తెచ్చుకున్న శోభన్ బాబు క్రమశిక్షణ కలిగిన నటుడని సాహితీ సాంస్కృతిక సేవాతత్పరుడు డాక్టర్ వేముల హజరత్ గుప్తా అన్నారు. సినీ నటుడు శోభన్ బాబు 16వ వర్ధంతి గాంధీనగరంలో జరిగింది. ఝుమ్మంది నాదం ఎస్ ఎస్ కె (విజయవాడ) ఆధ్వర్యంలో ఏలూరు లాకులు వద్ద శోభన్ బాబు విగ్రహానికి పూలదండలు వేసే నివాళులర్పించారు. అనంతరం కౌతా పూర్ణానందం కళావేదికపై జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన గుప్త మాట్లాడుతూ దైవ బలం సినిమాతో సినీరంగ ప్రవేశం చేసి దాదాపు 220 చిత్రాలలో ఆయన నటించిన పాత్రలు ప్రత్యేకతను చాటుకోటమే గాక నంది, ఫిలిం ఫేర్, సినీ గోయర్స్, వంశీ అవార్డులు, కేంద్ర ప్రభుత్వ నుంచి ఉత్తమ నటుని అవార్డులను ఎన్నో ఆయనను వరించాయన్నారు. వర్ధమాన కళాకారులు సినీ రంగంలో ఎటువంటి క్రమశిక్షణ కలిగి ఉండాలో, సంపాదనను ఎలా కాపాడుకోవాలో ఆయన జీవితం తెలుపుతుందన్నారు. సంస్థ రాష్ట్ర అధ్యక్షులు పైడిపాటి వెంకన్న మాట్లాడుతూ శోభన్ బాబు జయంతి, వర్ధంతి కార్యక్రమాలు ప్రతి ఏటా జరుపుతామన్నారు. అనంతరం పలువురు గాయనీ గాయకులు శోభన్ బాబు నటించిన చిత్రాలలోని పాటలను రసరమ్యంగా పాడి వినిపించి అభినందనలు అందుకోవడమే కాక శోభన్ బాబుకు స్వర నీరాజనాలర్పించారు.

విజయవాడలో భారీగా నగదు పట్టివేత

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్) : విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం పరిధిలోని భాను నగర్ జంక్షన్ వద్ద గురువారం రూ.12 లక్షల నగదును ఎన్నికల అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అధికారిణి లత మీడియాతో మాట్లాడుతూ.. బ్యాంకు పత్రాలను పరిశీలించిన అనంతరం కొంత నగదుకు సరైన పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి ఐటీ అధికారులకు అప్పగిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనల మేరకు కేవలం ఒక మనిషి ఎటువంటి పత్రాలు లేకుండా రూ.50 వేల వరకు తీసుకెళ్లొచ్చని చెప్పారు.

ప్రైవేటు బ్యాంకులు రైతుల ఆర్థిక స్వావలంబనకు సహకరించాలి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్) : బ్యాంకర్లు ఖాతాదారులకు శ్రద్ధతో సేవలందించాలని సాంకేతిక విద్యాశాఖ కమీషనర్ చదలవాడ నాగరాణి అన్నారు. విజయవాడలోని విశాలాంధ్ర రోడ్డులో కరూర్ వైశ్యా బ్యాంక్ 836వ శాఖను నాగరాణి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చదలవాడ మాట్లాడుతూ వినియోగదారులకు సకాలంలో బ్యాంకింగ్ సేవలు అందినప్పుడే మంచి ఫలితాలు ఆశించవచ్చన్నారు. ప్రవేటు రంగ బ్యాంకులు గ్రామీణ ప్రాంతాలలోని రైతుల అవసరాలకు అనుగుణంగా మంచి పథకాలను ప్రవేశ పెట్టాలన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆంజనేయ జ్యువెలరీ నుండి వడ్లమూడి వెంకటరావు, మోడల్ డైరీ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పిన్నమనేని ధన ప్రకాష్, బ్యాంక్ జనరల్ మేనేజర్ నితిన్ ఆర్కాట్ రంగస్వామి, క్లస్టర్ హెడ్ సూర్య శ్రీ రాష్టేకె చేశారు. మరియు బ్రాంచ్ మేనేజర్ కెవిఎల్ వి ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు. కరూర్ వైశ్యా బ్యాంక్ 1916లో స్థాపించబడి,

ఫైనాన్స్ రంగంలో ప్రముఖ బ్యాంకుగా అవతరించింది.

30న 'రన్ ఫర్ జీసస్'

విశాలాంధ్ర-విజయవాడ ఎడ్యుకేషన్: ఈస్టర్ (పాస్కా) పర్వదినం పురస్కరించుకొని విజయవాడలోని అన్ని క్రైస్తవ సంఘాలు ఫెడరేషన్ ఆఫ్ తెలుగు చర్చెస్ హెడ్స్ ఆధ్వర్యంలో వేలాదిమంది క్రైస్తవులు ఈ నెల 30వ తేదీన "రన్ ఫర్ జీసస్" (యేసు కోసం పరుగు) భారీ ర్యాలీని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు విజయవాడ కతోలిక పీఠం మోన్సిన్యోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్ తెలిపారు. గురువారం సిద్ధార్థ పాలిక్లినిక్ రోడ్డులోని గాయత్రినగర్ మరనాత టెంపుల్లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా ప్రపంచ శాంతి కోసం ప్రతి సంవత్సరం ఈ "రన్ ఫర్ జీసెస్" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని గుర్తుచేశారు. విజయవాడలోనే కాకుండా ఆంధ్రప్రదేశ్లోని పలు ప్రాంతాలలో కూడా ఈ "రన్ ఫర్ జీసెస్" కార్యక్రమాన్ని క్రైస్తవులు నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ "రన్ ఫర్ జీసెస్" ర్యాలీని 30వ తేదీ ఉదయం 5.30 గంటలకు బెంజిసర్కిల్ సమీపంలోని పటమట సెయింట్ పాల్స్ కథెడ్రల్ (చర్చి) ప్రాంగణంలో విజయవాడ కతోలిక పీఠం బిషప్ మోస్ట్. రెవ. బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు, చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా (సిఎస్ఐ) బిషప్ మోస్ట్. రెవ. బిషప్ జార్జ్ కొర్నెలియస్ తదితర ప్రముఖులు జండా ఊపి లాంఛనంగా ర్యాలీని ప్రారంభిస్తారని తెలిపారు. మరనాత టెంపుల్ రెవ. అల్లూరి విశ్వప్రసాద్ మాట్లాడుతూ ఈ భారీ "రన్ ఫర జీసెస్" ర్యాలీ సెయింట్ పాల్స్ కథెడ్రల్ నుండి 5.30 గంటలకు ప్రారంభమై సిద్ధార్థ పాలిక్లినిక్ రోడ్డు మీదుగా మదర్ థెరిస్సా సర్కిల్ గుండా గిరిపురం శిఖామణి సెంటర్ మీదుగా స్టేట్ గెస్ట్ హౌస్ దగ్గరలోని సియస్ఐ సెయింట్ పాల్స్ చర్చ్ ప్రాంగణానికి చేరుకొని ముగిస్తుందన్నారు. కనుక నగరంలోని క్రైస్తవులందరూ పెద్ద ఎత్తున పాల్గొని "రన్ ఫర్ జీసెస్" కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మోన్సిన్యోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, రెవ. అల్లూరి విశ్వప్రసాద్, రెవ. ప్రవీణ్ శీలం, రెవ. ఎస్. జయకుమార్ తదితర క్రైస్తవ ముఖ్య ప్రతినిధులు "రన్ ఫర్ జీసెస్" గోడపత్రిక (పోస్టర్)ని ఆవిష్కరించారు. ఈ సమావేశంలో రెవ. ఇందుపల్లి కరుణానిధి, రెవ. బందెల దయానంద్, రెవ. విశ్వప్రసాద్, రెవ. శీలం ప్రవీణ్, రెవ. తూమాటి పాల్, రెవ. ఎస్. జయకుమార్, రెవ, బీరారాజు, రెవ. ఫిలిప్ తదితర క్రైస్తవ నాయకులు పాల్గొన్నారు.

దబ్బాకుపల్లి గ్రామ బూత్ కమిటీ అధ్యక్షుల నియామకం

విశాలాంధ్ర-వత్సవాయి : రానున్న ఎన్నికల నేపథ్యంలో మండలంలోని దబ్బాకుపల్లి గ్రామంలో వైకాపా నాయకుల సమక్షంలో బూత్ కమిటీ అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంగాపు వెంకటేశ్వర్లు, కొంగర కనకారావు, నిమ్మకాయల త్రివేణి లను నాయకుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంగాపు వెంకటేశ్వర్లు (జనత) మాట్లాడుతూ రానున్న ఎన్నికలకు మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం.. ఎంతోనమ్మకంతో తమకు అప్పగించిన బాధ్యతలను నిర్వర్తిస్తానని సభాముఖంగా తెలిపారు ఈ కార్యక్రమంలో... జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు సయ్యద్ బాబు, గ్రామ సర్పంచ్ కొట్టే నగేష్, ఉప సర్పంచ్ జాలకృష్ణ, నియోజకవర్గ ముస్లిం మైనార్టీ అధ్యక్షులు షేక్ రన్ హుస్సేన్, సొసైటీ అధ్యక్షులు పండగ శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్, ప్రముఖ నాయకులు పాలు మాలు రాజు, కుక్కల రాజు, వార్డు సభ్యులు డీలర్ బాబు, మరియు మాజీ ఎంపీటీసీ సభ్యులు దారెల్లి శ్రీనివాసరావు వత్సవాయి యువ నాయకులు భూక్యరాజా, జడ్పిటిసి సభ్యులు ఏసు పోగు దేవమణి శ్రీనివాస్, మండల ఎంపీపీ కొలుసు రమాదేవి తిరుపతిరావు, లేళ్ళ నాగేందర్ రెడ్డి, చెంబేటి రాజేష్ సయ్యద్ షరీఫ్, పేటేటి నాగరాజు, యూత్ నాయకులునవీన్, అల్లావుద్దీన్, యువ నాయకులు వడుగు సునీల్ కుమార్ తదితర పార్టీ ప్రముఖులు నాయకులు కార్యకర్తలు భారీ స్థాయిలో పాల్గొన్నారు

మూల్యాంకన పారితోషికాలు సకాలంలో చెల్లించాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : పదవ తరగతి పబ్లిక్ పరీక్ష పత్రాలమూల్యాంకన పారితోషికాలను మూల్యాంకన విధులు పూర్తయ్యే లోగా ఉపాధ్యాయులందరికీ చెల్లించే విధంగా తగిన చర్యలు చేపట్టాలని డెమొక్రటిక్ పిఆర్టియు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ డి.శ్రీను ప్రభుత్వ పరీక్షల విభాగపు డైరెక్టర్ డి.దేవానంద్ రెడ్డి ని కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ పరీక్షా విధులను నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు అత్యవసరంగా ఏదైనా ఇబ్బందులు తలెత్తితే పరీక్ష నిర్వహణకు ఎలాంటి ఇబ్బంది రాకుండా ఉండడానికి గాను ప్రతి పరీక్షా కేంద్రంలో విద్యార్థుల సంఖ్య తో నిమిత్తం లేకుండా ఒక అదనపు ఇన్విజిలేటర్‌ను నియమించాలని మూల్యాంకన కేంద్రాలలో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ అంశాలపై ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్‌కు విజ్ఞప్తి చేయగా సానుకూలంగా స్పందిస్తూ ఉపాధ్యాయులకు ఎక్కడ ఇటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు చేపడతామని మూల్యాంకన విధుల పూర్తయ్యేలోగా సంబంధిత చెల్లింపులు జరిపేటట్లుగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిరన్నారు.

మిక్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉమకు డాక్టరేట్

విశాలాంధ్ర-కంచికచర్ల: కంచికచర్ల మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ లో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పని చేస్తున్న ఎల్. ఉమ ఆంగ్లంలో డాక్టరేట్ అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.వంశీ కిరణ్ తెలిపారు. ఆంగ్ల విభాగంలో ఎ సైకో అనలిటికల్ స్టడీ ఆఫ్ ది సెలెక్ట్ నోవెల్స్ ఆఫ్ అనిత దేశాయ్ అండ్ శశి దేశ్పాండే అనే అంశంపై అసిస్టెంట్ ప్రొఫెసర్ యల్. ఉమ చేసిన పరిశోధనకు గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. తాను చేసిన పరిశోధనల వలన మనుషుల మానసిక పరిస్థితి గురించి, వారి ఆలోచన విధానం మరింతగా మెరుగు పరుచుకోవడానికి చాలా ఉపయోగ పడుతుందని డాక్టర్ ఎల్. ఉమ తెలిపారు. డాక్టరేట్ సాధించిన ఎల్. ఉమని మిక్ కళాశాల సీఈఓ డి. పాండురంగారావు, మేనేజ్మెంట్ మెంబర్ ఎం. సుహాస్, ప్రిన్సిపల్ డాక్టర్ టి. వంశీ కిరణ్, వివిధ శాఖల అధిపతులు, అధ్యాపకులు కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు.

అంతర్జాతీయ పవర్‌లిఫ్టింగ్ పోటీలకు కేబీఎన్ విద్యార్థి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): త్వరలో జరిగే అంతర్జాతీయ పవర్‌లిఫ్టింగ్ పోటీలకు తమ కళాశాల విద్యార్థి పీ భరత్‌కుమార్ హాజరుకానున్నట్లు కాకరపర్తి భావనారాయణ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు తెలిపారు. ఏషియన్ యూనివర్శిటీస్ పవర్‌లిఫ్టింగ్ కప్ ఛాంపియన్‌షిప్ మే ఐదు నుంచి 11వ తేదీ వరకూ

హంకాంగ్‌లో జరగనున్నట్లు పేర్కొన్నారు. అందులో భారతదేశం పక్షాన తమ కళాశాల విద్యార్థి పీ భరత్‌కుమార్ హాజరవుతున్నట్లు తెలిపారు. దానికి అయ్యే ఖర్చు సుమారు రూ.1.50 లక్షల వ్యయాన్ని కళాశాల పక్షాన భర్తిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఆ మొత్తాన్ని విద్యార్థి భరత్‌కుమార్‌కు గురువారం కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు అందించారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల యజమాన్యం విద్యార్థులను అభినందించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, కే రామకృష్ణ, క్రీడా విభాగాధిపతి డీ హేమచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు విద్యార్థుల ఎంపిక



విశాలాంధ్ర-రెడ్డిగూడెం : ఈనెల 10వ తేదీన గురుకుల పాఠశాలల్లో 5వతరగతి ప్రవేశానికి జరిగిన పరీక్షల్లో మండల కేంద్రమైన రెడ్డిగూడెం ఫ్రెండ్స్ సర్వీసు సొసైటి ఆఫ్ ఫ్రీ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ సెంటర్ నందు శిక్షణ పొందిన విద్యార్థులు ఎంపికైనట్లు ఫ్రెండ్స్ సర్వీసు సొసైటి అధ్యక్షులు చాట్ల విజయ్‌కుమార్ గురువారం తెలిపారు. శిక్షణలో పొందిన 13 మందికి గాను 9 మంది విద్యార్థులు గురుకులంకు అర్హత సాధించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

ఘనంగా పోషణ పక్వాడ " ప క్షో త్స వాలు

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : పోషణ పక్వాడ పక్షోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రేడ్ - 1 సూపర్ వై జర్ ఉషారాణి.చిల్లకల్లు ప్రాజెక్ట్ ఆఫీసర్ లక్ష్మి భార్గవి వారి ఆదేశాలు మేరకు గ్రేడ్- 1 సూపర్ వైజర్ ఉషారాణి ఆధ్వర్యంలో పోషణ పక్వాడ పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా పెనుగంచిప్రోలు గ్రామం లో విద్యా, వైద్య, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది మరియు అంగన్వాడీ సిబ్బంది,గ్రామస్థులు ఆధ్వర్యంలో రక్త హీనత నివారణ మరియు బరువు తక్కువ పిల్లలు గురించి సమావేశం ఏర్పాటు చేసి గ్రామస్థులు కి అవగాహన కల్పించడమైనది .ఈ కార్యక్రమంలో ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

PASSPORT LOST

I, Borra Rakesh Kumar, S/o. Borra Srirama Murthy, D.No. 19-113, Tulasi Nagar 1st Street, Kanuru, Vijayawada-520007 I Lost My Pass Port Bearing No.P/IND/U9668848 while House Shifting in P&T Colony, 3rd Road, Pantakalava Road, Patamata, Vijayawada-520010. Finders please contact : 8341186873

CHANGE OF NAME

I, Jagarlamudi Swapna (Old Name), W/o. Jagarlamudi Murali Krishna Residing at # 74-10/1-3/1, F.No.503, Signaure Apt., Lakshmipati Nagar, Patamata, Vijayawada, NTR District-520007, A.P. Indian. I changed my name to POPURI SWAPNA (New Name) Hence forth I will be known as POPURI SWAPNA

CHANGE OF NAME

I, Abhishek (Old Name), S/o. Kantilal Jain Residing at # 1-1-151/6, A-Block, 509, Kousthuba Nivas, Kummaripalem Center, Bhavanipuram, Vijayawada-520012, NTR District, A.P. I changed my name to ABHISHEK JAIN (New Name) S/o. Kantilal Jain Hence forth I will be known as ABHISHEK JAIN

LOST OF DOCUMENT

I, Thota Subba Rao, S/o. Thota Kanakaiah, R/o. DNo. 55-1-7/3, Temple Street, (100 ft. Raod), Beside Ramapriya Apartments, Near Panta Kalava, Patamata, Vijayawada-520 009, NTR Dist. A.P. I, have lost my Daughter-in-law of Kandi Sujatha, W/o. Suryachandra Rao, Original Document bearing Document No. 5761/2005 which was Registered in Saroornagar S.R.O. in Telangana state on 26-11-2005. This Original Document was lost by me on date 03-03-2024. While I, was going to by Auto to RTC Bus Depot from my house. I, noticed that the bag containing the Original Document was missing. I searched a lot for the bag. But the Document was not found. So if any one found the Document please inform me at the above mentioned address or Contact me at 90598 62699

బంగారు నగల వేలం ప్రకటన

ఈ ప్రకటన ద్వారా తెలయజేయునది ఏమనగా ది.23-03-2024 శనివారం ఉ॥ 11 గం॥లకు గవర్నరుపేట బ్రాంచ్ నందు 20.00గ్రాములు, ప్రకాష్‌నగర్ బ్రాంచి నందు 1166.00గ్రాములు, మరియు రామవరప్పాడు బ్రాంచి నందు 128.00 కుదవపెట్టిన పాత బంగారు నగలు మా హెడ్ ఆఫీస్ నందు వేలం వేయబడుచున్నవి. వేలం వేయబడుచున్న నగలు వినియోగదారుల సమయం దాటిపోయి నందున, వారందరికీమా వేలం పాట ప్రకటనలు రిజిస్టర్ పోస్టు ద్వారా పంపడం జరిగినది. వేలం పాటలో పాల్గొనే వ్యక్తి తమ అడ్రస్ ప్రూఫ్ & ఐ.డి.ప్రూఫ్ వెంట తీసుకుని రావలెను. సెక్యూరిటి డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై నిబంధనల కొరకు దయచేసి మా హెడ్ ఆఫీసు నందు సంప్రదించగలరు.

H.O.అరుణా ఫైనాన్స్ లిమిటెడ్
డోర్ నెం. 59-2-1/2. మొదటి అంతస్తు, అమ్మ ఫంక్షన్ హాల్, అశోక్‌నగర్, విజయవాడ-10.
సెల్: 88851 22377

25 నుంచి బుల్లితెరపైకి మైత్రీ మూవీ మేకర్స్ మా అన్నయ్య

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట: అనూహ్యమైన కథతో రానున్న' మా అన్నయ్య' మార్చి 25న ప్రారంభం, సోమవారం నుంచి శనివారంవరకు ప్రతిరోజు సాయంత్రం 6:30గంటలకు, మీజి తెలుగులో ప్రసారంకానున్నట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. మా అన్నయ్య సీరియల్ కథగంగాధర్ జీవితం చుట్టూ తిరుగుతుందన్నారు. ప్రముఖ నటుడు గోకుల్ మీనన్ గంగాధర్ పాత్రలో కనిపించనున్నారని, రాధమ్మ కూతురులో అరవింద్ పాత్రను పోషించడం ద్వారా విజయవంతంగా తన స్టార్ పవర్ ని స్థాపించుకున్నారనన్నారు. ఈ షో గ్రాండ్ లాంచ్ మరియు దాని కథాంశం గురించి జీ తెలుగు చీఫ్ కంటెంట్ ఆఫీసర్- అనురాధగూడూరు మాట్లాడుతూ, జీ తెలుగు ప్రేక్షకులను అలరించే లక్ష్యంతో మరొక విలక్షణమైన కథను తీసుకురావడం మాకు సంతోషంగా ఉందన్నారు. ఆకట్టుకునే కథాంశం, ప్రతిభావంతులైన నటీనటులతో రూపొందుతున్న ఈ కథ మన హృదయానికి చాలా దగ్గరగా ఉంటుంది, అంతేకాకుండా, తెలుగు బుల్లితెరపై తొలిసారిగా ఒక కథానాయకుడి కోణం నుంచి చూడబోతున్నమా అన్నయ్య ప్రేక్షకులను తప్పక అలరిస్తుందనన్నారు. ప్రధానపాత్ర పోషిస్తున్న గోకుల్ మీనన్ మాట్లాడుతూ.. 'జీ తెలుగులో నేను నటిస్తున్న రెండోసీరియల్ ఇది మా అన్నయ్య కథ చాలా ఆసక్తికరంగా ఉందన్నారు. ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థమైత్రీ మూవీమేకర్స్ రూపొందిస్తున్న ఈ సీరియల్ లో నటించడం చాలా ఆనందంగా ఉందనీ, భావోద్వేగాలతోకూడిన ఇలాంటి లోతైన పాత్రను పోషించడాన్ని గౌరవంగా భావిస్తున్నాను' అన్నారు. మా అన్నయ్య ఈ సీరియల్ ప్రారంభం సందర్భంగా మైత్రి మూవీ మేకర్స్ నిర్మాతలు మాట్లాడుతూ వెండితెరపైనే కాకుండా బుల్లితెర ప్రేక్షకులకూ వినోదం పంచడంలో భాగమవుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఆకట్టుకునే సీరియల్స్ కార్యక్రమాలతో విజయవంతంగా కొనసాగుతున్న జి తెలుగు మా పరిధిని విస్తరించేందుకు ఒక అద్భుతమైన వేదికను అందిస్తోందనన్నారు. .

కొత్తూరు తాడేపల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం వార్షికోత్సవం

-అమ్మవారికి బంగారు మంగళసూత్రాలు బహుకరించిన ఈవీఈ చైర్మన్ ఈడా వేదాద్రి

విశాలాంధ్ర-విజయవాడ (వన్ టౌన్) : విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లి పంచాయతీ పరిధిలోని కొత్తూరులో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఏడో వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. సమరసత సేవా ఫౌండేషన్, తిరుమల తిరుపతి దేవస్థానం సంయుక్తంగా నిర్మించిన ఈ ఆలయంలో ఏటా వార్షికోత్సవ వేడులను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ వేడుకలకు కొత్తూరు తాడేపల్లి సర్పంచ్ ఉయ్యూరు గోపాలరావు, మాజీ ఉప సర్పంచ్ దొంతగాని వెంకటేశ్వరరావు, గొల్లపూడి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ధూళిపాళ్ల రమేష్ ముఖ్య అతిథులుగా హాజరై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. వార్షికోత్సవ వేడుకలలో భాగంగానే ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు భద్రి వెంకట్రావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజలలో ఈవీఈ సంస్థ చైర్మన్ ఈడా వేదాద్రితోపాటు వంకదారు సత్యదుర్గ వెంకటేశ్వరరావు, గోళ్ల సాయికుమార్ దంపతులు ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. కాగా, ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈవీఈ సంస్థ చైర్మన్ ఈడా వేదాద్రి అమ్మవార్లకు రూ.50 వేల విలువైన మంగళసూత్రాలను ప్రత్యేకంగా తయారు చేయించి బహుకరించారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు భద్రి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు పోతురాజు శేఖర్, కోశాధికారి పోతురాజు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది రమణను కలసిన యార్లగడ్డ

విశాలాంధ్ర-గన్నవరం : గన్నవరంలోని ప్రముఖ న్యాయవాది కేవీ. రమణ నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి టీడీపీలోకి ఆహ్వానించిన గన్నవరం నియోజకవర్గ టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు , మచిలీపట్నం మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ బుల్లయ్య.ఈ సందర్భంగా ఆయన అనుచరులతో కలిసి టీడీపీలో చేరలని న్యాయవాది కేవీ. రమణ కోరారు.ఈ కార్యక్రమంలోమాజి ఆ యం సి చెర్మాన్ పొట్లూరి బసవరావు, కె కొటేశ్వరవు ,అల్లా గోపాలకృష్ణ, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధి కోసం టిడిపిని గెలిపించండి : జ్ఞానేశ్వరి

విశాలాంధ్ర-గన్నవరం : అభివృద్ధి పరంగా అట్టడుకు చేరిన రాష్ట్రానికి తిరిగి పూర్వ వైభవం తీసుకొచ్చి అభివృద్ధి పథం లో నడిపించే సత్తా టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుకి మాత్రమే ఉందని గన్నవరం నియోజకవర్గ టిడిపి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు సతీమణి జ్ఞానేశ్వరి తెలిపారు.గురువారం విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు గ్రామంలో ఆమె ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఇంటింటికి తిరుగుతూ తెలుగుదేశం పార్టీకి ఓట్లు వేసి భారీ మెజార్టీతో టిడిపి అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు. టిడిపి ప్రభుత్వ హయాం లో మహిళలకు సముచిత స్థానం గౌరవం దక్కాయని ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత మహిళలపై దాడులు అధికమయ్యాయి అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో గ్రామ పార్టీ అధ్యక్షుడు చాగంటి పాటి వెంకట కృష్ణ కోనేరు శివరామకృష్ణ (పెద్ద బాబు), కోనేరు వెంకట నారాయణ ఐదవ వార్డు సభ్యులు, కోనేరు సందీప్, వెళ్ళంకి శరత్ కుమార్, పాటపంచాల వెంకట్రావు, పొదిలి లలిత, కనుమోలు విజయ్, మువ్వా విజయ లక్ష్మి, మాజీ ఎంపీటీసీ గోగా బాల కోటేశ్వరరావు, మాజీ జపీటీసీ గోగా ఉషారాణి, కోడలి సుబ్బారావు, నిమ్మగడ్డ దశమంతురావు, మాజీ సర్పంచ్ వారికూటి కోటేశ్వరరావు, కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత సిరంజీలను అభివృద్ధి చేసిన హెచ్ఎండీ

విశాలాంధ్ర-విజయవాడ (వన్ టౌన్) : డిస్పోజబుల్, ఆటోడైజబుల్ సిరంజీల తయారీలో అగ్రగామి సంస్థల్లో ఒకటైన హిందుస్థాన్ సిరంజిస్ అండ్ మెడికల్ డివైజెస్ (హెచ్ఎండీ) అత్యంత వినూత్నమైన, మొట్టమొదటిసారిగా సురక్షిత సూదితో కూడిన డిస్పోజెక్ట్ సింగిల్ యూజ్ సిరంజీలను విజయవాడలో విడుదల చేసింది. ఈ సందర్భంగా హెచ్ఎండీ ప్రతినిధులు సోహైల్ నాథ్, రాజీవ్ నాథ్ మాట్లాడుతూ భారతదేశం వైద్య పరికరాల తయారీలో గ్లోబల్ పవర్హౌస్గా రూపొందేందుకు ఆత్మనిర్భరత సాధించడానికి ఇది ఉపయోగపడుతుందన్నారు.వైద్య పరికరాల తయారీ, ఎగుమతుల్లో స్వావలంబన కేంద్రంగా మారేందుకు భారత్ చేస్తున్న ప్రయత్నాలకు అనుగుణంగా ఈ ప్రయోగం జరిగిందన్నారు. హెల్త్ కేర్ వర్కర్లకు అయ్యే గాయాలు, సంబంధిత ఖర్చులను తగ్గించడం ద్వారా డిస్పోజెక్ట్ వైద్యరంగంపై సానుకూల ఆర్థిక ప్రభావాన్ని తీసుకువస్తుందని భావిస్తున్నామన్నారు. విప్లవాత్మక డిస్పోజెక్ట్ సురక్షిత సిరంజీలతో, ఆరోగ్య కార్యకర్తలలో ప్రమాదవశాత్తు సూది గాయాల (ఎన్ఎస్ఐ) ప్రాబల్యాన్ని తగ్గించడం, వ్యాప్తి నియంత్రణ ఖర్చు, పారవేయడం, శిక్షణను తగ్గించడం, వైద్యరంగంపై దీర్ఘకాలిక సానుకూల ఆర్థిక ప్రభావాన్ని అందించడం హెచ్ఎండీ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. దేశీయంగా తయారైన, సాంకేతికంగా అధునాతన ఉత్పత్తులు భారతదేశానికి పరిశోధన, అభివృద్ధి రంగంలో ప్రపంచ అంచును అందిస్తాయనీ, పదునైన గాయాలను నివారించగలిగే సిరంజీల కోసం అత్యధిక డిమాండ్ ఉన్న ప్రపంచ మార్కెట్ను తీర్చడానికి స్వదేశీ కంపెనీలను అధిగమిస్తాయనీ చెప్పారు.

'మామిడి పల్లి'కి ఘన సన్మానం

విశాలాంధ్ర-విజయవాడ : అందరితో మంచి సంబంధాలు కలిగి, ఎటువంటి వివాదాలకు తావు లేకుండా అతికీలకమైన సమాచార, పౌర సంబంధాల శాఖలో 30 సంవత్సరాలు ఉద్యోగ జీవితాన్ని కొనసాగించిన మామిడిపల్లి బాలగంగాధర్ తిలక్ సమాచారశాఖలో మణిపూస అని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్ కుమార్ రెడ్డి అన్నారు. విజయవాడలోని సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రధాన కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ కార్యదర్శిగా పదవీ విరమణ చేయనున్న బాలగంగాధర్ తిలక్ ను ఐ అండ్ పీఆర్, కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కమిషనర్ విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ.. చిరునవ్వుతో అందరినీ పలకరిస్తూ ఉద్యోగ జీవితాన్ని కొనసాగించడమే కాక అజాతశత్రువుగా తిలక్ పేరు తెచ్చుకున్నారన్నారు. నేటి తరం ఉద్యోగులు తిలక్ ను ఆదర్శంగా తీసుకోవాలని ఆకాంక్షించారు. రాష్ట్ర విభజన సమయంలో విజయవాడలో జాయింట్ డైరెక్టర్ హోదాలో మీడియా సెంటర్ ను విజయవంతంగా నిర్వహించి ఎప్పటికప్పుడు ప్రభుత్వ సమాచారాన్ని మీడియా సంస్థలకు అందించారన్నారు. పదవిలో ఉన్నంతకాలం సంస్థ ప్రగతి కోసం కృషి చేసిన తిలక్ పదవీ విరమణ అనంతరం మంచి ఆరోగ్యంతో తమ జీవితాన్ని కుటుంబంతో సంతోషంగా గడపాలని కమిషనర్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత మామిడిపల్లి బాలగంగాధర్ తిలక్ మాట్లాడుతూ 1994 నుండి వివిధ హోదాల్లో 30 ఏళ్ల నిర్విరామంగా పనిచేసే అవకాశం కలిగినందుకు సమాచార, పౌర సంబంధాల శాఖకు, విధి నిర్వహణల్లో సహకరించిన సహోద్యోగులకు, ఇతర సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. సంస్థ కోసం అహర్నిశలు కష్టపడే కమిషనర్ విజయ్ కుమార్ రెడ్డి సారధ్యంలో జాయింట్ డైరెక్టర్ పనిచేయడం సంతోషంగా ఉందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఖమ్మం డీపీఆర్వోగా, భద్రాచలం ఐటీడీఏలో ఏపీవోగా, వరంగల్ డిప్యూటీ డైరెక్టర్ గా, రాష్ట్ర విభజన అనంతరం విశాఖపట్నం రీజినల్ జాయింట్ డైరెక్టర్ విధులు నిర్వర్తించిన అనంతరం ప్రెస్ అకాడమీ కార్యదర్శిగా పదవీ విరమణ చేస్తుండటం ఎంతో సంతృప్తినిస్తోందన్నారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ డైరెక్టర్ స్వర్ణలత అధ్యక్షత వహించగా, జాయింట్ డైరెక్టర్లు పోతుల కిరణ్ కుమార్, కస్తూరి బాయి తేళ్ల, మణిరామ్, సూర్య చంద్రరావు, చీఫ్ ఇంజినీర్ మధుసూదన్ రావు, సమాచార, పౌర సంబంధాల శాఖలో వివిధ హోదాల్లో సమర్థవంతంగా విధులు నిర్వర్తించిన తిలక్ గురించి తమ తమ అభిప్రాయాలను వెల్లడించారు. అనంతరం కమిషనర్ చేతుల మీదుగా జ్ఞాపికను అందజేయడంతో పాటు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో తిలక్, ఉషారాణి దంపతులను ఘనంగా సన్మానించారు. సమాచార, పౌర సంబంధాల శాఖ ఉన్నతాధికారులు, అధికారులు, ఇతర శాఖల సిబ్బంది, జర్నలిస్ట్ సంఘాల నాయకులు సైతం తిలక్, ఉషారాణి దంపతులను సత్కరించారు.

పిరమిడ్ పార్టీలో శాకాహారులకు పోటీ

విశాలాంధ్ర-గుడివాడ : పోటీ చేసే వ్యక్తులు ఏ పార్టీకి సంబంధించిన వారైనా శాకాహారులు అయితే పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా మద్దతుగా నిలుస్తుంది. పిరమిడ్ స్పిరిట్యుయల్ సొసైటి జిల్లా అధ్యక్షురాలు రాజకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ అహింసా ధర్మస్థాపనకు సంకల ప్రాణికోటి రక్షణకు ఆత్మజ్ఞానులే పరిపాలకులు కావటానికి బ్రహ్మర్షి పితామహ పత్రిజీ స్థాపించిన, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా ఎన్నికల్లో పోటికి సిద్ధంగా ఉందన్నారు. ప్రజలకు సుపరిపాలన అందించగల సమర్థులు మా పార్టీలోకి వస్తే వారికి సీట్లు ఇచ్చి ప్రోతహిస్తామన్నారు. తమ పార్టీలోకి వచ్చే వారు శాకాహారలు, ధ్యానం మీద శ్వాస ఉండలన్నారు. ఆత్మజ్ఞానయుత మేథావులనే ఎన్నుకుందాం పిరమిడ్ పార్టీని గెలిపించాలని పిలుపు నిచ్చారు.

సత్యనారాయణకు సత్కారం

విశాలాంధ్ర - గుడివాడ : భీమేశ్వరాలయం ట్రస్టీ పొదిలి సత్యనారాయణను నాయి బ్రాహ్మణ సంఘాలు నాయకులు ఘనంగా సత్కరించారు. గురువారం స్థానిక సత్యనారాయణపురంలో ఆయన స్వగృహం వద్ద సంఘీయులు బంటుమిల్లి రోడ్డులోని భీమేశ్వరాలయం మెంబర్గా నియమితులైన పొదిలి సత్యనారాయణను దుశాల్వతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు డి.ఆర్.బి ప్రసాద్, చుండి బాబి, ద్రోణాదుల రామకృష్ణ, చుండి మధు, చిత్తాబత్తుల సాంబశివరావు, చుండి మహేష్కుమార్, హరికృష్ణ, చింతలూరు సత్యనారాయణ, మోహన్బాబు తదితరులు పాల్గొన్నారు

టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం : కాగిత

విశాలాంధ్ర-పెడన : రాష్ట్ర సమగ్రాభివృద్ధి తెలుగుదేశం పార్టీ కూటమితోనే సాధ్యపడుతుందని పెడన నియోజకవర్గ ఉమ్మడి శాసనసభ అభ్యర్థి కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని కట్లపల్లి, రాజీవ్ నగర్, తూర్పు తెలుగు పాలెం లో ఎన్నికల ప్రచారంలో పర్యటించారు. ఈ సందర్భంగా రాజీవ్ నగర్ కాలనీవాసులు మహిళలు కాగిత కృష్ణ ప్రసాద్, బొడ్డు వేణుగోపాలరావు లను ఘన స్వాగతం పలికి కర్పూర హారతులతో పూలమాలలు వేసి, దుశాలవాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ ఇంటింటా తిరుగుతూ సైకిల్ గుర్తుపై ఓటు వేసి శాసన సభ్యునిగా నన్ను గెలిపించాలని బందర్ పార్లమెంట్ జనసేన పార్టీ అభ్యర్థి బాలశౌరికి గాజు గ్లాస్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు యక్కల. శ్యామలయ్య, నియోజవర్గ పరిశీలకు సాధన బోయిన ఏడుకొండలు, రాష్ట్ర దేవాంగ సాధికార కమిటీ సభ్యులు యర్రా. నాగరాజు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మైనార్టీ కార్య నిర్వాహక కార్యదర్శి హమీదుల్ల (గుజ్రాల్) మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్దుల్ హాయుం, పరసా . సూర్యనారాయణ, చందన నారాయణరావు, సేనాపతి అజయ్ కుమార్, బూసం ఆనందరావు, పరసా.జితేంద్ర, బెజవాడ నాగరాజు,ఉమ్మడి పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

రాజ్యలక్ష్మి అమ్మవారి జన్మదిన మహోత్సవాలు

విశాలాంధ్ర-నందిగామ: నందిగామ మండలం మాగల్లు గ్రామంలోని శ్రీ వైకుంఠ నారాయణ క్షేత్రంలో శ్రీ లక్ష్మీ నర సింహ స్వామి ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మ వారి జన్మదిన మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారుఏ ఎస్ ఎన్ సి సేవా ట్రస్ట్ సభ్యుల పర్యవేక్షణలో రెండవ రోజు గురువారం ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయ అర్చక స్వాముల అంగర రాంబాబు ఆచార్యుల ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారికి విశేష అర్చనలు మూలమంత్ర హోమాది క్రతువులు పూజలు జరిగాయి, రాత్రి శ్రీవారిని శేష వాహన సేవ, సర్వభూపా ల ప్రత్యేక అలంకరణలో తిరుమాడవీధుల్లో మేళ తాళాలు మంగళ వాయిద్యాల,గోవింద నామస్మరణ నడుమ ఊరేగింపు లో భక్తులు పాల్గొన్నారు.నందిగామ పట్టణం శ్రీ సీతా రామాంజనేయ స్వామి దేవాలయంలో 71వ శ్రీరామ కోటి మహోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి, శ్రీ రమా సహిత సత్య నారాయణ వ్రతం లో భక్తులు పాల్గొన్నారు, సీతారామనామ సంకీర్తన సంఘం అధ్యక్ష, కార్యదర్శి,కోశాధికారులు పారేపల్లి సాయి బాబు,దుడ్డు నాగేశ్వరావు,పులిపాటి శ్రీనివాస్,సంఘ సభ్యుల పర్యవేక్షణలో నారాయణ సేవ లో భాగంగా అన్న ప్రసాద వితరణ లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఉత్సవాలకు సహాయ సహ కారాలు అందించిన భక్తులకు శ్రీ సీతారామ నాథ సంకీర్తన సంఘం సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

వైసీపీ ట్రాప్లో పడకండి : నాగబాబు

విశాలాంధ్ర-గుంటూరు : వైసీపీ నాయకులు తాము ఓడిపోతున్నామనే నిర్ధారణకు వచ్చేశారు.. అందుకే రకరకాల కుయుక్తులతో జన సైనికులను, వీర మహిళలను, జనసేన శ్రేణులను గందరగోళపరచే కుట్రలు చేస్తున్నారని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు స్పష్టం చేశారు. జనసేన పార్టీ నాయకులు, వీర మహిళలు, జన సైనికులు ఎవరూ వైసీపీ ట్రాప్లో పడవద్దని సూచించారు. జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి విజయమే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని చెప్పారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం జరిగిన చిత్తూరు జిల్లా కార్యవర్గ సమావేశంలో నాగబాబు మాట్లా డారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా తిరుపతి నియోజకవర్గంలో జనసేన పార్టీని గెలిపించుకునేందుకు శ్రమించాలని పిలుపునిచ్చారు. పార్టీ ఆవిర్భావం నుంచి వివిధ హోదాల్లో పనిచేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరా టాలు చేసిన, పార్టీ కోసం నిలబడిన ప్రతిఒక్కరికి ఉమ్మడి ప్రభుత్వంలో సము చిత గౌరవం దక్కే విధంగా జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ అవకాశం కల్పిస్తారని అన్నారు. జనసేన పార్టీ వైసీపీ లాంటిది కాదని, జనసేన పూర్తి ప్రజాస్వామ్య విధానాలతో పనిచేస్తోన్న పార్టీ అని పునరుద్ఘాటించారు. జనసేన అభ్యర్థులు పోటీ చేస్తున్న ప్రతి నియోజకవర్గంలో కుట్రలు చేసి నెగ్గాలనే దుర్బుద్ధితో వైసీపీ నాయకులు ఉన్నారన్నారు. ఈ సమావేశంలో జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయ్, డాక్టర్ పసుపులేటి హరి ప్రసాద్, ఏవీ రత్నం, కిరణ్ రాయల్, జె.రాజా రెడ్డి, పంచకర్ల సందీప్, కీర్తన, సుభాషిణి, వనజ, శ్యామల, రాజేష్ యాదవ్, మధు తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాతో బహుపరాక్!

ప్రచార పంథాను మార్చేసిన నేతలు

కన్సల్టెన్సీకి ప్యాకేజీలు

నిఘా పెంచిన ఎన్నికల సంఘం

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: నేడు ఎన్నికలను సోషల్ మీడియా శాసిస్తోంది. దినపత్రికలు సైతం డిజిటల్, స్మార్ట్ ఎడిషన్లు ప్రారంభించాయి. వెబ్ న్యూస్ గురించి చెప్పనవసరం లేదు. 2019 పార్ల మెంటు ఎన్నికలు ఒకెత్తయితే, 2024 ఎన్నికలు మరో ఎత్తు. నేతలు ఎన్నికల ప్రచార పంథాను మార్చేశారు. గతంలోలాగా మైక్లు పట్టుకొని ప్రసంగాలు ఇవ్వాల్సిన అవసరం లేదు. ఇప్పు దంతా సోషల్ మీడియానే. ప్రచారమైనా, విమర్శ లైనా, ఎన్నికల హామీలైనా, ఇంట్లో కూర్చుని ఓటర్లను తమ వైపుకు తిప్పుకోవచ్చు. చైతన్యం తీసుకురావచ్చు. దీనికోసం నేతలు ప్రత్యేకంగా సోషల్ మీడియా టీమ్స్ ఏర్పాటు చేసుకొని రోజువారి కార్యక్రమాల వివరాలు, ప్రజలతో కలిసి ఉండే సందర్భాలను సోషల్ మీడియాలో అప్ డేట్ చేస్తున్నారు.

పార్టీలకు ప్రత్యేక సోషల్ మీడియా వింగ్లు

పార్టీలు కూడా ప్రత్యేకంగా సోషల్ మీడియా విభాగాలను ఏర్పాటు చేసుకున్నాయి. పార్టీ కార్యకలాపాలు, ప్రచార వివరాలు ఇలా అన్నింటిని ఈ విభాగం సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ పార్టీకి మైలేజీ తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాయి. కొందరు నేతలు తమ సోషల్ మీడియా ఖాతాలను సొంతంగానే ఏర్పాటు చేసుకుంటున్నారు. ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోలేక కొందరు, సమయం లేక కొందరు నేతలు కన్సల్టెంట్లను ఏర్పాటు చేసుకొని వారి సహాయం తీసుకుంటు న్నారు. . ప్యాకేజీలు మాట్లాడుకోవడంతో ఎన్నికల వరకు యువతకు ఉపాధి మార్గం సుగమమైంది.

ప్రచారం కోసం కోట్లు ఖర్చు

ఓటర్లను తమ వైపునకు తెచ్చుకునేందుకు పార్టీ లన్నీ ఇప్పుడు సోషల్ మీడియాపైనే ప్రధానంగా ఆధారపడ్డాయి. పార్టీలు, అభ్యర్థులు ప్రత్యేకంగా సోషల్ మీడియా టీంలను నియమించు కుంటున్నాయి. లక్షలు ఖర్చుపెట్టి ఆఫీసులను అద్దెకు తీసుకుంటున్నాయి. సోషల్ మీడియాలో రాజకీయాలపై అవగాహన, అనుభవం ఉన్నవారిని తీసుకుంటున్నారు. ప్రత్యర్థులను టార్గెట్ చేయడానికి, తమ తరఫున ప్రచారం చేయడానికి సోషల్ మీడియాను వాడేసుకుంటున్నాయి. ఏ పార్టీ అభ్యర్థులైనా ప్రచారం కోసం కోట్లు ఖర్చు పెట్టేందుకు వెనుకాడటం లేదు. డిమాండ్కు తగ్గట్టు డిజిటల్, పొలిటికల్ మార్కెటింగ్ ఏజెన్సీలు నియమించుకుంటున్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు తమ క్లైంట్లుగా ఒక్కో నేత దగ్గర కోట్లు వసూలు చేస్తున్నాయి.

చిక్కితే శిక్ష తప్పదు

ఒకవేళ అడ్మిన్ వివాదాస్పద పోస్ట్ పెడితే ఐటీ యాక్ట్తో పాటు ఐపీసీ సెక్షన్ 158 (ఎ) ప్రకారం 5ఏళ్ళ వరకు జైలు శిక్షకు గురయ్యే అవకాశం ఉంటుంది. ఆన్ లైన్లో వేధింపులు, సోషల్ మీడియాలో ట్రోలింగ్లు చేస్తే ఐటీ చట్టంలోని 67 ప్రకారం జైలుకు వెళ్లడానికి సిద్ధపడాలి. ఉద్దేశ పూర్వకంగా, లక్ష్యంగా చేసుకొని సోషల్ మీడియాలో పోస్టుల ద్వారా వేధించడం, అదేపనిగా దూషించడం, అవమానించడం చేస్తే ఐపిసి సెక్షన్ 354 ప్రకారం గరిష్టంగా 5ఏళ్ళ వరకు శిక్ష పడొచ్చు. ఎన్నికలవేళ చట్టాలను మరింత పటిష్టంగా అమలు చేస్తుండడంతో తప్పించుకొని అవకాశం ఉండదు. దొరకములే అని నిర్లక్ష్యంగా ఉంటే చిక్కులు తప్పవు. అదనాతన సాంకేతికతతో ఐడి అడ్రస్సుల ఆధారంగా ఏ సెల్ ఫోన్ నుంచి ఎప్పుడు పోస్ట్ చేశారు...? ఎవరు ఎప్పుడు షేర్ చేశారనే విషయాలు పోలీసులు పట్టేస్తారు. నేరస్తులను కటకటాల్లోకి నెట్టేస్తారు.

నిఘా పెంచిన ఎన్నికల కమిషన్

పోటీ చేసే అభ్యర్థులు ప్రచారానికి ఎన్ని రకాల అవకాశాలు ఉంటే... అన్ని దారులను ఉపయోగించుకుంటున్నారు. ప్రచారాన్ని ప్రత్యక్షంగా, పరోక్షంగా కొనసాగిస్తున్నారు. అందరి అరచేతిలో ఇప్పుడు స్మార్ట్ ఫోన్స్ ఉన్నాయి. ఇదే ఇప్పుడు ఈజీగా ఓటర్లకు చేరువయ్యేలా చేస్తోంది. సోషల్ మీడియా ప్రచారం ఇప్పుడు ట్రెండ్. ఢిల్లీ నుంచి గల్లీ దాకా జరిగే ప్రతి ఎన్నికలకు సోషల్ మీడియా ప్రధాన భూమిక అయ్యింది. సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై ఎన్నికల కమిషన్ నిఘా పెంచింది. ఎంసీఎంసీ కమిటీ సోషల్ మీడియా ప్రచారంపై ప్రత్యేక దృష్టి సారించింది. నిబంధనలు అతిక్రమించినా.. రెచ్చగొట్టే పోస్టింగులు చేసినా మత విద్వేషాలు రెచ్చగొట్టినా చర్యలు తీసుకోనున్నారు.

పౌరులు బాధ్యతగా మెలగాలి

సెల్ఫోన్ వల్ల ప్రపంచం కళ్ళముందుకు వచ్చిందని సంబరపడాలో... అదే ఉపకరణం వల్ల జీవితాలు గాడి తప్పుతున్నాయని బాధపడాలో తెలియని సందిగ్ధం. ప్రాణాలు మింగేసే స్థాయికి సోషల్ మీడియా ప్రభావం పెరిగిపోవడం మేధావులను సైతం ఆందోళనలోకి నెట్టేస్తోంది. ఈ క్రమంలో ఎన్నికలవేళ సెల్ ఫోన్తో అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా లేకపోతే మాత్రం తీవ్ర పరిణామాలకు స్వాగతం పలికినట్లే. ఇష్టానుసారం పోస్ట్ పెట్టేస్తాం... మంచి చెడుతో మాకేం పని షేర్ చేసేస్తాం.. బొటనవేలే కదా లైక్ కొట్టేస్తాం అంటే మాత్రం కటకటాల్లోకి నెట్టేయడానికి పోలీసులు సిద్ధంగా ఉన్నారు. పౌరులు బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని ఎన్నికలవేళ మరింత అవసరమని గుర్తుంచుకోవాలి.

విజ్ఞాన్స్ వర్సిటీ - ఎలైట్ యూనివర్సల్ స్పోర్ట్స్ల మధ్య అవగాహన ఒప్పందం

విశాలాంధ్ర-గుంటూరు : విజ్ఞాన్స్ యూనివర్సిటీ - ఢిల్లీలోని ఎలైట్ యూనివర్సల్ స్పోర్ట్స్ అలయన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ల మధ్య గురువారం అవగాహన ఒప్ప ందం కుదిరింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ ఎలైట్ యూనివర్సల్ స్పోర్ట్స్ అలయన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో మోహిత్ సింగ్తో అవగాహన పత్రాలను మార్చుకున్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం వలన జాతీయ స్థాయిలో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు యూనివర్సిటీ అథ్లెట్లకు ఒక ప్రత్యేక వేదికను కల్పిస్తుందన్నారు. బాస్కెట్బాల్, వాలీబాల్, ఇ-స్పోర్ట్స్, కబడ్డీ అనే నాలుగు లీగ్లు ఉంటా యని, ఒక్కో జట్టు లీగ్లో 5-6 మ్యాచ్లు ఆడే అవకాశం ఉంటుంద న్నారు. వీటి వలన అథ్లెట్లకు ప్లాట్ఫారమ్ అందించడంతో పాటు వారి ఖర్చులన్నీ ఎలైట్ పవర్ స్పోర్ట్స్ భరిస్తుందని చెప్పారు.. ఎలైట్ యూనివర్సల్ స్పోర్ట్స్ అలయన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో మోహిత్ సింగ్ మాట్లా డుతూ యువతను ప్రోత్సహించడమే ఈ ఒప్పందం లక్ష్యమన్నారు. అగ్రశ్రేణి ప్రతిభను రిక్రూట్ చేయ డానికి ఈ అవగాహన ఒప్పందం ఒక వేదికగా ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.